ప్రజాశక్తి

శనివారం 29 జూన్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పింఛన్ల పంపిణీకి చురుగ్గా ఏర్పాట్లు

- ఉద్యోగుల ఎంపికలో యంత్రాంగం తలమునకలు
- ఒకటి, రెండు తేదీల్లోనే పూర్తి చేయాలని ఆదేశాలు
- నేడు బ్యాంకుల నుంచి సొమ్ము డ్రా చేసుకోవాలని ఉత్తర్వులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం విస్తృత కసరత్తు చేస్తోంది. ఐదేళ్లుగా ఉన్న వాలంటీర్ల వ్యవస్థ స్థానంలో సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర శాఖల శాశ్వత ఉద్యోగులతో కలిపి లబ్ధిదారులకు ఇంటింటికి పింఛన్ల సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన సొమ్మును శనివారం బ్యాంకుల నుంచి డ్రా చేసుకోవాలని గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని అన్ని మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఎంపిడివోల నుంచి శనివారం సాయంత్రంలోగా పింఛన్లు పంపిణీ చేసే ఉద్యోగులు సొమ్ము తీసుకుని సోమవారం ఉదయం 6 గంటల కల్లా పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ధేశించింది.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పెంచిన ఫింఛను సొమ్ము ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్తింప చేస్తుండటంతో ప్రతి ఒక్కరికి మూడు నెలల అదనపు సొమ్ము కూడా అందనుంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.3 వేల పింఛను రూ.4 వేలకు పెరిగింది. వీరికి మూడు నెలల సొమ్ము మరో రూ.3 వేలు కలిపి ఒక్కొక్కరికి రూ.7 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేగాకుండా వికలాంగులకు రూ.3 వేలనుంచి రూ.6 వేలకు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వీరికి మూడునెలల పాటు రూ.3 వేలు చొప్పున అదనంగా రూ.9 వేలు, ఈనెల ఫింఛను రూ.6 వేలు కలిపి రూ.15 వేలు ఇవ్వనున్నారు. వ్యాధి గ్రస్తులకు ఇచ్చే ఫింఛన్లు కూడా పెంపుదల మేరకు మూడు నెలల సొమ్ము కలిపి ఇవ్వనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

గుంటూరు జిల్లాలో 2,61,598 మంది, పల్నాడు జిల్లాలో 2,83,119 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు. గత ఐదేళ్లుగా ప్రతి నెలా మొదటి వారంలో మూడు రోజుల పాటు పింఛను సొమ్ము ఇంటికి వచ్చి వాలంటీర్లు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు చాలా వరకు సంతృప్తిగా ఉండగా ఎన్నికల కోడ్‌వచ్చిన తరువాత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సచివాలయం ఉద్యోగులు ద్వారా కొంత మందికి, బ్యాంకుల ద్వారా కొంత మంది అందచేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఈనెల నుంచి తిరిగి ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో వాలంటీర్లు దాదాపు 20 వేల మంది ఉండగా సచివాలయం ఉద్యోగులు 13వేల మంది పనిచేస్తున్నారు. దీంతో సచివాలయాల ఉద్యోగులతోపాటు కొన్ని మండలాల్లో మండల పరిషత్ గ్రామ, పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులు, ఇంజినీరింగ్ సెక్షన్లలో పని చేసే వారినీ ఇందులో భాగస్వామ్యం చేశారు. వాలంటీర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ఇతర సాంకేతిక పరికరాలన్నీ సంబంధిత ఉద్యోగులకు అధికారులు శుక్రవారం అప్పగించారు.

గుంటూరు నగరంలో 57 వేల మంది పింఛను దారులు ఉండగా 14 వేల మంది సచివాలయం ఉద్యోగులు ఉండటం వల్ల ఇబ్బంది లేదని అధికార వర్గాలు తెలిపాయి. గ్రామాల్లో మాత్రం కొన్ని సచివాలయాల్లో ఉద్యోగులు సెలవుల్లో ఉండటం, ఖాళీలు భర్తీ కాకపోవడం, పలువురు రాజీనామా చేసి ఇతర ఉద్యోగాలుకు వెళ్లడం వల్ల సరిపడా ఉద్యోగులు లేక ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఇతర శాఖల వారితో పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రక్రియ శుక్రవారం సాయంత్రం పూర్తయిందని అధికారులు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

స్కీమ్ వర్కర్లను వేధిస్తే ఉద్యమం

- చిరుద్యోగులు రాజీనామా చేయాలనే ఒత్తిళ్లను టిడిపి, జనసేన నాయకులు మానుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులిచ్చి పథకాలు వర్తింపజేయాలి
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. గ్రామాల్లో ఇప్పటికే అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, యానిమేటర్లపై టిడిపి-జనసేన నాయకులు రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారని, వారి అనునయులకు ఉద్యోగాలు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కూడా కాకుండానే స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఒక ఉద్యోగిపై కుటుంబమే ఆధారపడి ఉంటుందని గ్రహించాలన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు టిడిపికి చెందిన వారిని ఉద్యోగాల నుండి తొలగి తొలగించాలని చూశారని, దీనిపై సిపిఎం పెద్ద ఎత్తున పోరాటం చేసిందని గుర్తు చేశారు. గౌరవ వేతనంతో పనిచేస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేయొద్దని, వారిపని వారిని చేసుకోనివ్వాలని కోరారు. వాలంటీర్లకు ఎన్నికలప్పుడు అనేక హామీలిచ్చిన టిడిపి ఇప్పుడు వారిపై కక్ష సాధింపులు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు

2లో

పిఆర్‌కె సోదరుడి కోసం అన్వేషణ

నెల రోజులుగా అజ్ఞాతంలోనే వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ఎన్నికల పోలింగ్ రోజున, అనంతరం జరిగిన ఘర్షణల్లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు అయి నెల్లూరు జైలులో ఉన్నారు. అయితే పలు కేసుల్లో రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా నిందితుడుగా ఉన్నారు. పోలింగ్ రోజున జరిగిన ఘటనల్లో రామకృష్ణారెడ్డితోపాటు వెంకట్రామిరెడ్డిని కూడా నిందితునిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కారంపూడిలో మే 14న జరిగిన దాడి ఘటనల్లో వెంకట్రామిరెడ్డిపై కూడా కేసు నమోదైంది. పోలింగ్ రోజున టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వాహనం దగ్ధం కేసు, మహిళపై దాడి ఘటన, పలు ప్రాంతాల్లో జరిగిన అల్లర్లలో టిడిపి వారు ఇచ్చిన ఫిర్యాదుల్లో వెంకట్రామిరెడ్డి పేరు కూడా ఉంది. ఈ నేపథ్యంలో గత నెల 13న ఎన్నికల కమిషన్ సీరియస్ కావడంతో వారిని గృహనిర్బంధంలో ఉంచారు. గతనెల 15న వీరు మాచర్ల నుంచి తెలంగాణకు వెళ్లిపోయారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవిఎంల ధ్వంసం కేసు బయటకు రావడంతో గతనెల 22న ఎన్నికల కమిషన్ సీరియస్‌గా పరగణించింది. దీంతో పిన్నెల్లి అరెస్టుకు ఆదేశాలు జారీ కావడంతో ఈ కేసుల్లో రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్ పొందగా ఆయనకు హైకోర్టు నుంచి బెయిల్ మంజూరు అయింది. అప్పటి నుంచి వెంకట్రామిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. హైకోర్టు ఆదేశాలతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నర్సరావుపేటలో బస చేయగా వెంకట్రామిరెడ్డి అదృశ్యమయ్యారు. తాజాగా తన సోదరుడు అరెస్టు అయి జైలుకు వెళ్లడంతో వెంకట్రామిరెడ్డి రాష్ట్ర సరిహద్దులు దాటినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వపెద్దల సూచనల మేరకు

2లో

ప్రత్తిపాడు సిఐ, ఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సిఐ నిసార్ బాష, ఎస్ఐ సోమేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీల విషయంలో మండలంలోని గొట్టిపాడులో ఇటీవల జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా వట్టిచెరుకూరు మండలం గారపాడులో పోలీస్ పికెట్ ఉన్నప్పటికీ అక్కడ దాడులు జరిగి పలువురు గాయపడ్డారు. అయితే అక్కడ విధుల్లో ఉన్నవారిపై చర్యలు తీసుకోకుండా గొట్టిపాడులో స్వల్ప ఘర్షణపై చర్యలు తీసుకోవడం చర్చనీయాంశమైంది.

దాడి ఘటనపై కేసు

ఇళ్ల కూల్చివేత విషయంలో సమాచార హక్కు కార్యకర్త, టిడిపికి చెందిన కమ్మ శివప్రసాద్‌పై గురువారం జరిగిన కత్తుల దాడిపై శుక్రవారం కేసు నమోదైంది. నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని చెరువు స్థలంగా భావిస్తున్న ప్రాంతంలో ఇళ్లేసుకుని నివాసం ఉంటున్న వారిలో ఒకరైన పడబక్కల పరమేశ్వరరావు, అతని సోదరుడు వెంకటేశ్వర్లు కలిసి శివప్రసాద్ ఇంటికెళ్లి వేట కొడవళ్లతో గురువారం దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శివప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఫిర్యాదులో కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు

1-4-1989 నుండి 30-6-2024 వరకూ
ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులుగా ,
యం.ఇ.ఒ.గా, డిప్యూటీ డి.ఇ.ఒగా (ఎఫ్ఎసి, సత్తెనపల్లి)
35 సంవత్సరాలపాటు విద్యాశాఖలో
సేవలు అందించి, వేలాది మందిని విద్యార్థులను తీర్చిదిద్ది
పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు

శ్రీ వీసం (వీరిశెట్టి) వెంకటేశ్వరరావు భార్య- రుక్మిణిదేవి (లేటు)
ఎం.ఇ.ఓ., గుంటూరు ఈస్ట్, వెస్ట్

కుమార్తెలు - అల్లుళ్ళు
సాధు శ్రీదివ్య B.Tech., - నరశింహారావు B.Tech.,
పోలినాటి లక్ష్మీలావణ్య B.Tech., - ఆశిష్‌కుమార్ B.Tech.,

మనుమలు, మనవరాలు
సాధు వెంకటవీక్షిత్, సాధు రిత్విన్, పోలినాటి అవని
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అధికారులు, సిబ్బంది.
వీరిశెట్టి బ్రదర్స్ సౌజన్యంతో...

పాఠశాలకు ఆర్‌జెడి సందర్శన

ప్రజాశక్తి - పెదకూరపాడు : స్థానిక జెడ్‌పి పాఠశాలను ఆర్‌జెడి లింగేశ్వర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, అందరూ అంకితభావంతో పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సామ ర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం బూట్లు పంపిణీ చేశారు. ఎంఇఒ సత్యనారాయణ, హెచ్‌ఎం కెవి రమణ పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ఉపాధ్యాయుల సమావేశం

ప్రజాశక్తి - పొన్నూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు నూరు శాతం భర్తీ చేయాలని ఎంఇఒలు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి సూచించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ వైఎస్టి సాయి పలు అంశాలను వివరించారు.

పిఆర్‌కె సోదరుడి కోసం అన్వేషణ

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వెంకట్రామిరెడ్డి అరెస్టుకు అధికారులు చర్యలు తీసుకుంటారని టిడిపివర్గాలు భావిస్తున్నాయి. గత రెండేళ్లుగా టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్నబ్రహ్మారెడ్డిని పూర్తిగా నియంత్రించి టిడిపి వారిపై దాడులకు తెగబడటం వెనుక వెంకట్రామిరెడ్డి కీలక భూమిక పోషించారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఎక్కడ ఉంది తెలుసుకుని త్వరలో పట్టుకుని ఆయా కేసుల్లో అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిసింది.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహిస్తామని చైర్మన్ షేక్ రఫాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశంలో నిర్వహించే సమావేశంలో అజెండాలోని 54 అంశాలపై చర్చ ఉంటుందని, కౌన్సిలర్లు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

తాళ్లూరు మేనేజర్‌గా జ్యోతి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా వి.జ్యోతి బాధ్యతలు చేపట్టారు. ఖాతాదార్లకు నాణ్యమైన సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. వ్యవసాయ రుణాలు ఇవ్వటానికి ముందంజలో ఉంటామన్నారు. గృహ, వాణిజ్య రుణాలు కూడా ఇస్తామన్నారు.

స్కీమ్ వర్కర్లను వేధిస్తే ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

విజయకుమార్ మాట్లాడుతూ కౌలుకు సాగు చేయడాన్ని మాత్రమే అర్హతగా భావించి షరతులేమీ లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, పంట రుణాలు, ఇతర రాయితీలు ఇవ్వాలని కోరారు. కౌల్దార్లకు అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలను ఇవ్వాలన్నారు. ప్రస్తుతం సాగుదారుల్లో 70 శాతం మందికి పైగా కౌలురైతులే ఉన్నారని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో పెట్టిన కూలి డబ్బులను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి రాయితీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, పురుగు మందులు ఇవ్వాలన్నారు. నూతన ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే ప్రజల పక్షాన పోరాటానికి సిపిఎం సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. అధికారులు కూడా సమన్వయతో పని చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.

సుభాన్‌ఖాన్‌కు ఘన నివాళి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

కుటుంబంతో పాటు దేశాన్ని ప్రేమించడం కమ్యూనిస్టులకే సాధ్యమని, సుభాన్‌ఖాన్ చివరి వరకు కమ్యూనిస్టుగా జీవించారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, జి.రవిబాబు అన్నారు. మండలంలోని పాటిబండ్లలో సిపిఎం సీనియర్ నాయకులు సుభాన్ ఖాన్ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. తొలుత సుభాన్‌ఖాన్ చిత్రపటానికి పూలువేసి నివాళు లర్పించారు. రాధాకృష్ణ, రవిబాబు మాట్లాడుతూ సుభాన్‌ఖాన్ పేదల వైద్యునిగా పెదకూరపాడు మండ లంలో మంచి గుర్తింపు పొందారున్నారు. జనం వద్ద ఏమి ఆశించకుండా సేవ కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. టిడిపి రాష్ట్ర నాయకురాలు పి.నూర్జహాన్ మాట్లాడుతూ సుభాన్‌ఖాన్ కుటుంబంతో పాటు సమాజానికి ఎనలేని సేవ చేశారన్నారు. ఆయనే తమకు ఆదర్శమని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డిఎస్ రావు, సూరిబాబు, హనుమంతరావు, యేసయ్య, శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు జహీర్ ఖాన్, ముజీబ్ ఖాన్, అజాద్ ఖాన్, ఫిరోజ్ ఖాన్, సిరాజ్, షేక్ ఫిరోజ్ పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీరు నింపడానికి ఖర్చెంత?

మాట్లాడుతున్న జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కాల్వలు పూడికలు తీయడం లేదని, చెత్తకుప్పలను తొలగించడం లేదని పలువురు టిడిపి కౌన్సిలర్లు విమర్శించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి సాంబశివరావు అధ్యక్షతన జరిగింది. అజెండాలోని పలు అంశాలపై టిడిపి, జనసేన కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీని వివరణ అడిగారు. గార్లపాడు రోడ్‌లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నాగార్జునసాగర్ కుడికాల్వ నీటితో నింపే క్రమంలో ఏయే రకం మోటర్లు ఎన్ని ఉపయోగించారు? ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలు ఇవ్వాలని జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కోరారు. వైస్ చైర్మన్ కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నింపే కార్యక్రమాన్ని తప్పు పట్టడం సమంజసం కాదన్నారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన పార్టీ కౌన్సిలర్ సుమన్‌కు వాగ్వాదం జరిగింది. కమిషనర్ కలుగజేసుకుని వివరణివ్వడంతో గొడవ సద్దుమణిగింది.

నేడు, రేపు గుంటూరులో కేంద్ర మంత్రి పర్యటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి : కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శని, ఆదివారాల్లో గుంటూరులో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతులపై అధికారులు, ప్రజా ప్రతినిధుల్తో చర్చించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుంటూరులోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. తరువాత స్వగ్రామం బుర్రిపాలెం వెళతారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ శాఖపై సమీక్షలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుంటూరులోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని మంత్రి కార్యాలయం వర్గాలు తెలిపాయి.

ఆరునెల్లుగా వేతనాల్లేని పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని పిడిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.రామకృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. 14 మంది నిరుపేద దళిత మహిళలు 20 ఏళ్లుగా సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని, ఫస్ట్ ఆబ్జెక్టివ్ కాంట్రాక్టర్ సంస్థ గత 6 నెలల నుండి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు గురిచేస్తోందని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.16 వేలు చెల్లించాల్సి ఉండగా పిఎఫ్ పేరుతో కట్ చేసి రూ.11 వేలు మాత్రమే ఇస్తున్నారని, దీనిపై విచారణ జరిపి కాంట్రాక్టర్ నుండి కార్మికులకు వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎం జిల్లా అధ్యక్షులు మస్తాన్‌వలి, కార్మికులు అన్నమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని నారాకోడూరు జెడ్‌పి పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. వీరి అభినందన సభ పాఠశాలలో శుక్రవానం నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఇఒ-2 ఆర్.సుబ్బారావు హాజరై ఎంపికైన విద్యార్థులు కె.బాల భవ్యశ్రీ , ఎన్.సిరి, పి.షమీ, ఎం.గౌతమ్ వెంకట్ కార్తీక్, ఎం.నాగేశ్వర్ ప్రసాద్, జి.ప్రదీప్ కుమార్‌కు బహుమతులిచ్చారు. వీరికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు రూ.48 వేలు స్కాలర్‌షిప్‌గా అందుతాయని, 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కేంద్ర ప్రభుత్వం మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తుదని తెలిపారు. విద్యార్థుల ఎంపికలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరావు, ఎ.శ్రీనివాసరావు ఎమ్‌డి సల్మాకాటూన్, డివి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రిజర్వేషన్లపై పాట్నా హైకోర్టు తీర్పు సరికాదు'

ప్రజాశక్తి-గుంటూరు

బీహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సామాజిక రిజర్వేన్లు 50 శాతం దాడటం సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమంటూ పాట్నా హైకోర్టు రద్దు చేయటం సరికాదని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయస్థానాల తీర్పుల్లోనూ పేదలు, బడుగుల పట్ల వివక్షత ఉంటుందనటానికి పాట్నా కోర్టు తీర్పు ఒక నిదర్శమని పేర్కొన్నారు. ఏ కమిషన్ సిఫార్సులుగా, గణాంకాలుగానీ ప్రాతిపదికలుగా చెప్పకుండానే, రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం తెచ్చిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు మాత్రం అనుకూల తీర్పులు ఇవ్వటం, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తే అడ్డు పుల్లలు వేయటం బాధాకరమన్నారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో మొత్తం 60 శాతం సీలింగ్ దాటినప్పుడు లేని అభ్యంతరం బీహార్‌లో శాస్త్రీయంగా జనగణనలో సమగ్ర కులగణన అధారంగా పెరిగిన జనాభా మేరకు పెంచితే మాత్రం ఆ పెంపు చెల్లదంటూ తీర్పు ఇవ్వటం అన్యాయమని, ఈ విషయమై త్వరలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

రామకృష్ణారెడ్డి అరెస్టు తొలిఅడుగే

- **ఆయన సోదరుడూ ఊచలు లెక్కించడం ఖాయం : ఎమ్మెల్యే జీవీ**
- **అరెస్టుతో పల్నాడులో ప్రశాంత వాతావరణం : ఎమ్మెల్యే ప్రవీణ్**

ప్రజాశక్తి - వినుకొండ

ప్రశాంత పల్నాడు కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు తొలి అడుగు మాత్రమేనని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. పల్నాడును సొంత జాగీరుగా, మాఫియా అడ్డాగా చేసుకున్న రౌడీమూక ఆటకట్టిందని, పచ్చనిపల్లెల్లో ఫ్యాక్షన్ నెగళ్లు ఎగదోసిన ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. అరాచాక వైసిపి పాలన పోవడంతో శాంతిభద్రతలకు తిరిగి మంచిరోజులు వచ్చాయని, పోలీసులు తమ పని తాము చేసుకోవచ్చని పిన్నెల్లి అరెస్టుతో స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లైందని పేర్కొన్నారు. అయిదేళ్లుగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నో నేరాలు, ఘోరాలకు పాల్పడ్డారని, వాటన్నింటికీ శిక్షలు పడితే జీవిత కాలం అతడు జైలు నుంచి బయటకు వచ్చే అవకాశమే లేదని అభిప్రాయపడ్డారు. రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా త్వరలో ఊచలు లెక్కించడం ఖాయమన్నారు. మైనింగ్ అక్రమాలు, సహజవనరుల లూటీతో పాటు మాచర్ల నియోజకవర్గం మొత్తం వ్యాపారులు, సామాన్యులు బెదిరించి రామకృష్ణారెడ్డి చేసిన ఘోరాలపైనా సమగ్ర దర్యా ప్తు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒక్కమాచర్ల నియోజకవర్గంలోనే పిన్నెల్లి గడిచిన ఐదేళ్లలో రూ.2 వేల కోట్లకు పైగా దోపిడీ చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. అతడి వల్ల నష్టపోయిన స్థానిక బాధితులు ఇప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి తమ బాధలు చెప్పుకోవచ్చని సూచించారు. టిడిపి శ్రేణులపై పిన్నెల్లి సోదరులు సాగించిన మారణకాండపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నడిరోడ్డుపై గొంతుకోసి చంపిన టిడిపి కార్యకర్త తోట చంద్రయ్యకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఐదేళ్ల వైసిపి పాలనలో రాజకీయ హత్యలు, దాడులు, దౌర్జన్యాలతో అరాచకాలకు కేరాఫ్ మారిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడం శుభపరిణామమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సహజ వనరులను నిలువునా దోచుకున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుతో పల్నాడు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొందని, ఆయనపై 14 కేసులున్నా ఇప్పటివరకు శిక్ష పడకుండా తప్పించుకు తిరిగాడని విమర్శించారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈవీఎం ధ్వంసం ఆయన అరాచకాలకు ప్రత్యక్ష సాక్ష్యమని, వెలుగులోకి రాని ఘటనలు వందల సంఖ్యలో ఉన్నాయని అన్నారు. ఆయన అక్రమాలకు సహకరించిన అధికారులు, పోలీసులపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలరు.

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

రూ. 3 లక్షల సొత్తు స్వాధీనం

గంజాయి క్రయ,విక్రయాలపై నిఘా

గుంటూరు జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ముగ్గురు నిందితులను అరెస్టు చేసి సుమారు 3.12 లక్షల రూపాయల విలువ కలిగిన బంగారం, వెండి సొత్తును స్వాధీనపరుచుకున్నట్లు గుంటూరు జిల్లా క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి నగరంలోని పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ జల్సాలకు చెడు వ్యసనాలకు అలవాటు పడి మంగళగిరి పట్టణ రూరల్ ప్రాంతాలలో మోటార్ సైకిళ్ళు చైన్ స్నాచింగ్ దొంగతనాలు పాల్పడుతున్న విజయవాడ అయోధ్య నగర్‌కు చెందిన కుందుల విగ్నేష్ బాబు అదుపులోకి తీసుకొని మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన కేసులో 32 గ్రాముల బంగారు నానుతాడు, గుంటూరు పోలీస్ స్టేషన్ చెందిన 20 గ్రాముల బంగారు నాను తాడు మొత్తం సుమారు 52 గ్రాములు వాటి విలువ సుమారు 3.12 లక్షల రూపాయల సొత్తును స్వాధీనపరుచుకున్నామన్నారు. అదేవిధంగా గుంటూరు నగరం గోరంట్లకు చెందిన చిల్లర సురేష్ గుంటూరు జిల్లా పెదనందిపాడుకి చెందిన పైర్ల కిరణ బాబు తీసుకొని మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ చెందిన దొంగతనం కేసులో 10 గ్రాముల బంగారం 16 గ్రాముల సిల్వర్, మరొక 5 గ్రాములు బంగారం కూసుమంచి పోలీస్ స్టేషన్ చెందిన కేసులో 14 గ్రాముల బంగారం 24 గ్రాముల సిల్వర్ చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు విలేకరులకు తెలియజేశారు. మోటార్ బైకులు చైన్ స్నాచింగ్, ప్రత్యేకించి గంజాయి క్రయవిక్రయాలపై నిఘాబెట్టామని ఆయన వెల్లడించారు. చోరీ సొత్తును రికవరీ చేసేందుకు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారంగా జల్లెడపెట్టి మంగళగిరి పట్టణ రూరల్ గుంటూరు సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా నిందితులను అరెస్ట్ చేయటం జరిగిందని శ్రీనివాస రావు వెల్లడించారు. జిల్లా ఎస్పీ తుషార్ డుడి ఆదేశాల మేరకు జిల్లా క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు సూచనలు మేరకు సిసిఎస్ డిఎస్పి శివాజీ రాజ్ మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డి.ఎస్.పి సిహెచ్ రవికాంత్ పర్యవేక్షణలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ వెంకన్న చౌదరి, మంగళగిరి రూరల్ సీఐ వై శ్రీనివాసరావు, పట్టణ సీఐ డి వినోద్ కుమార్, రూరల్ పట్టణ ఎస్ఐలు జే క్రాంతి కిరణ్, షేక్ ఖాదర్ బాషా లతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పి తుషార్ దూడి

పోలీసుల నుంచి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా లో పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు ఎస్పి తుషార్ దూడి శుక్రవారం "పోలీస్ గ్రీవెన్స్ డే" నిర్వహించారు. ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగుల నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన అనేక మంది పోలీసులు తమ సమస్యలను ఎస్పి వివరించారు. సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని కార్యాలయం నకు వచ్చిన సిబ్బంది కి హామీ ఇచ్చారు.

దాడులు, శిలాఫలకాల ధ్వంసం ఆపాలి

మాట్లాడుతున్న శేషగిరిరావు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ప్రజాశక్తి - తెనాలి :కూటమి ప్రభుత్వం మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేని విధంగా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి రాగానే నియోజకవర్గం లో వైసిపి పాలనలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం, వైయస్సార్ విగ్రహాలను పగులగొట్టడం, హేయమైన చర్య అన్నారు. వైసిపి కౌన్సిలర్ భర్త కాళిదాసు సత్యంపై కూడా ఎన్నికల ఫలితాలు వచ్చిన రెండో రోజునే దాడి జరిగిందన్నారు. కక్షపూరితంగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ రెడ్ బుక్ లో పేర్లు నమోదు చేస్తున్నామని, అధికారంలోకి రాగానే ప్రతీకారం తప్పదంటూ హెచ్చరించిన వైనంలోనే ప్రస్తుతం కూటమి పాలన సాగుతుందన్నారు. దీనివలన కూటమికే నష్టమని, వైసిపి శ్రేణులు మనోధైర్యాన్ని కోల్పోరని చెప్పారు. పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వారికి బాసటగా నిలుస్తామని చెప్పారు. కూటమికి ప్రజలు ఎంతో మెజారిటీని ఇచ్చారని, దానిని గుర్తించి ఇప్పటికైనా కక్షపూరిత ధోరణిని విడనాడాలని హితవు పలికారు. తెనాలిలో శిలాఫలకాల ధ్వంసం, వైసిపి నాయకుల పై జరిగిన దాడుల వివరాలతో డిఎస్పి కి, కమిషనర్ కు వినతి పత్రాలు సమర్పిస్తున్నామని, ఆయా ఘటనలలో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట మద్దాలి శేషాచలం, తాడిబోయిన రమేష్, కాళిదాస్ సత్యం తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

పింఛన్ల పంపిణీ బాధ్యతగా చేపట్టాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు మండలంలో జులై 1 నుండి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని ఎంపిడిఒ ఆదినారాయణ రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాయాలు, పంచాయతీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి, పింఛన్ల పంపిణీపై పలు సూచనలు చేశారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 4701 మంది పించన్‌దారులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరులో నోవెల్ హోటల్ ప్రారంభం

ప్రారంభిస్తున్న మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక చంద్రమౌళి నగర్ 1వ లైన్‌లోని అత్యాధునిక సదుపాయాలతో నూతనంగా నిర్మించిన నోవెల్ హెూటల్‌ను మాజీ పార్లమెంట్ సభ్యులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజధాని జిల్లాగా ఉన్న గుంటూరు నగరంలో అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులో ఉండే విధంగా 5స్టార్ హెూటల్‌ను అత్యంత అధునాతన సౌకర్యాలతో మెట్రో నగరాలకు ధీటుగా రూపొందించటం ఎంతో అభినందనీయం అని అన్నారు. అన్ని ఫంక్షన్లకూ అనువుగా ఈ హెూటల్ ఉందని, ఉత్తమ సదుపాయాలు అందిస్తున్న హెూటల్ మేనేజ్‌మెంట్‌ను ఆయన అభినందించారు. నోవెల్ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ నూనె రవీంద్రనాద్‌రెడ్డి మాట్లాడుతూ సంపాదనే ధ్యేయంగా కాకుండా వినియోగ దారులకు సంతృప్తి కరమైన సేవలు అందించాలనే ధ్యేయంతో ఆరోగ్యకరమైన వాతావరణం, అధునాతన వాతావరణం, సాంకేతిక వసతులతో ఈ హెూటల్ రూపొందించామన్నారు. నోవెల్ హోటల్‌లో సంప్రదాయ పద్ధతిలో కట్టెల పొయ్యిమీద వండటం మా ప్రత్యేకత అని, రూఫ్‌టాప్ రెస్టారెంట్, నెల్లూరు చేపల పుసులు, హైదరాబాద్ మటన్ బిర్యానీ పలు రకాల నాన్‌వెజ్‌లు రుచికరంగా సేవలు అందించబడతాయని అన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S. No. 29/2022

బిట్వీన్:

వాది: Kopparthi Krishna Srinivas

Vs

ప్రతివాదులు:

1. M/s. Harsha Surgicals, Gudlavalleru, Rep. by its Prop: Ballem Ananda Babu.

2. Ballem Ananda Babu, S/o. Siva Narayana, Harsha Surgical Business, R/o. Inner Ringroad, Bypass Teja Enclave, Flat No. 162, Guntur, Guntur Dist.,

ఈ నెంబరు దావాలో ప్రతివాదులుకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించినను వాళ్ళు తీసుకొనక వాదిని చిక్కులు పెట్టవలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున వారికి దావా సమన్లు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై ప్రతివాదులు హాజరు నిమిత్తము **ది. 08-7-2024 సం॥తేదీకి వాయిదా వేసినారు.** కావున సదరు వాయిదాకు ప్రతివాదులు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం 10 గంటలకు** శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఎన్.ఆనంద చక్రవర్తి

నరసాపురం — అడ్వకేట్, నరసాపురం

ది.26-6-2024 — సెల్: 98491 45267

హత్య కేసులో జెడ్‌పిటిసి భర్తకు రిమాండ్

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి గ్రామంలో జూన్ 4న చిలువూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మహమ్మద్ ఖాసిం హత్య కేసులో ముద్దాయి దుగ్గిరాల జడ్పిటిసి భర్త దాసరి వీరయ్య శుక్రవారం తెనాలి సెకండ్ ఏఎంఎం కోర్టులో లొంగిపోగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధిస్తూ రేపల్లె సబ్ జైలుకు పంపించారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు అయిన వీరయ్య గతంలో రెండు హత్య కేసుల్లో ముద్దాయి. అయితే రెండు కేసుల నుండి బయటపడినట్లు చెప్పుకునే వాడు. తుమ్మపూడి గ్రామంలో హత్య జరిగినప్పటినుండి పరారీలో ఉండి పోలీసులకు చిక్కకుండా కోర్టుకు హాజరయ్యాడు. జూన్ 7వ తేదీన ఇదే హత్య కేసులో తుమ్మపూడి గ్రామానికి చెందిన నలుగురు ముద్దాయిలను స్థానిక పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు పంపించగా ప్రస్తుతం వారు రిమాండ్లో ఉన్నారు. మరో ముద్దాయి తెనాలి పట్టణానికి చెందిన వైసిపి నాయకుడు గద్దేటి సురేంద్ర పరారీలో ఉన్నాడు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో వెంకట్ అనే యువకుడు అధికంగా నిద్ర మాత్రలు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన ఆత్మహ త్యకు ఇంటూరి శ్రీని వాసరావు, మరో వ్యక్తి కారణమని సెల్ఫీ వీడియో తీసుకుని ఈ దారుణానికి పాల్పడ్డాడు. బంధువులు వెంటనే గమనించి మంగళగిరి ఆసుపత్రికి తర లించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు

పెదవడ్లపూడి శాఖ. సెల్ నెం : 9390478371.

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, మా పెద్దవడ్లపూడి శాఖ బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న రుణమును ఎన్ని నోటీసులు పంపినను దిగువ తెలిపిన వారు బాకీ చెల్లించి యుండలేదు. రుణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారు నగలు ది. 09-07-2024 మంగళవారం మధ్యాహ్నం 4-00 గం.లకు బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలం వేసి వారి పేరున వున్న బకాయిలకు జమ కట్టుకోబడును. వేలంలో పాల్గొనదలచిన వారు ది.9-7-2024 ఉదయం 11 గం.ల లోపు 10,000/- డిపాజిట్‌గా చెల్లించవలెను. ఎట్టి కారణము చూపకుండానే వేలమును రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు.

క్రమసంఖ్య	ఖాతా నెంబరు	ఖాతాదారుని అడ్రస్	బంగారం గ్రాములలో
1)	707130100 167913	సీలం ప్రసాద్, తండ్రి : లక్ష్మీనారాయణ	14.600
2)	707130100 168709	సీలం ప్రసాద్ తండ్రి : లక్ష్మీనారాయణ	16.500

మాజీ ప్రధాని పీవీకి నివాళులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు 103వ జయంతి వేడుకలు గుంటూరులో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్రాడీపేట మెయిన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గల పి.వి. విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులు అర్పించారు. కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి, పరశురామ బ్రాహ్మణ సంఘం అధ్యక్షురాలు కప్పగంతుల ఆదిలక్ష్మి, శ్యాంసుందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నోరూరించే పండ్లు.. కొనబోతే చేదు..

- సామాన్యులకు అందని స్థాయిలో ధరలు
- ఏ రకం కాయలు కొందామన్నా ప్రియమే

రోడ్ల వెంట వివిధ రంగుల్లో నిగనిగలాడుతూ అనేక రకాల తాజాపండ్లు కనిపిస్తున్నా వాటిని కొనే సాహసం సామాన్యులు చేయలేకపోతున్నారు. కొంతమంది ధైర్యం చేసి కాయల వద్దకు వెళ్లినా అమ్మేవారు చెప్పే ధరలకు నోరెళ్లబెట్టుకుని వెనక్కు వస్తున్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అందరిళ్లల్లోనూ కనిపించే అరటి పండ్లు డజన్ రూ.50-80 వరకు ఉంటున్నాయి. పైనాపిల్ ముక్కను గతంలో రూ.5 ఇచ్చేవారు ఇప్పుడు పావుకిలో రూ.30-40కు అమ్ముతున్నారు. ఇవి రెండు మూడు ముక్కలకు మించి కావడం లేదు. వీడిగా ముక్క కొనాలంటే రూ.15 వరకూ తీసుకుంటున్నారు. గతంలో గిద్ద నేరేడు కాయలు రూ.5-10కి అమ్మేవారు. 10-12 కాయలు వచ్చేవి. ఇప్పుడు పావుకిలో రూ.50-60కు అమ్ముతున్నారు. మామిడి కాయలు డజన్ల లెక్కలు పోయి కిలోల లెక్కన అమ్ముతున్నారు. కాయ రకాన్ని బట్టి రూ.100 నుండి రూ.150 వరకు అమ్ముతున్నారు. సాధారణ రకమైతే ఒక్కోకాయ రూ.25-30 వరకూ ధర పలుకుతుండగా మేలురకంగా భావించే కాయలు ఒక్కటే కిలో వరకూ తూకు తోంది. ముక్క రూ.5కు అమ్మిన బొప్పాయి కూడా ఇప్పుడు కాయ రూ.60-65 వరకు ఉంది. రూ.20-30 వరకు గతంలో కొన్న సపోటా ఇప్పుడు రూ.50కు చేరింది. దానిమ్మ, యాపిల్ ధరల సంగతి సరేసరి.

ద్రాక్ష కాయల ధరలు రూ.30 నుండి రూ.50కు పెరిగాయి. కివి ఫ్రూట్ రూ.100కు రెండుమూడుకు మించి రావడం లేదు. రూ.40-50 ఉండే డ్రాగన్ ఫ్రూట్ రూ.70-80కు చేరింది. జామకాయలు సైతం కిలో రూ.50 పలుకుతోంది. వీటన్నింటి నేపథ్యంలో పండ్లు కొనడం సామాన్యులు, పేదలకు గగనమవుతోంది. ధరలపై ప్రభుత్వాలు నియంత్రణ తేవాలని జనం కోరుతున్నారు.

ఇదిలా ఉండగా పండ్ల ధరలు, అమ్మకం తీరుపై విక్రేతలను అడిగితే తాము సైతం అధిక ధరలకే కొంటున్నామని అంటున్నారు. తోటల వద్ద పండ్లను వాటి సైజులతో నిమిత్తం లేకుండా టన్నుల లెక్కన కొంటున్నామని, వాటిని గ్రేడింగ్ చేసి అమ్ముతుంటే కొన్ని సందర్భాల్లో తమకూ గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. ధరలు ఎక్కువగా ఉండడం వల్ల బేరాలు తక్కువగా ఉంటున్నాయని, కొన్ని సందర్భాల్లో సరుకు అమ్ముడవ్వక పాడవడంతో నష్టపోతున్నామని అంటున్నారు. బేరం బాగా వచ్చి సరుకుమొత్తం అమ్ముడుపోతే ఖర్చులు పోనూ రూ.1000-1500 మిగులుతుందని అంటున్నారు. లేకుంటే రూ.400-700తో సరిపెట్టుకోవాల్సి వస్తోందని, ఇది ఒకరోజు కూలితో సమానమని నిట్టూరుస్తున్నారు.

అంబటి రాంబాబు అక్రమ సంపాదనను పేదలకు పంచాలి : టిడిపి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాట్లాడుతున్న దివ్వెల శ్రీనివాసరావు

మాజీ మంత్రి అంబటి రాంబాబు అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు కోరారు. సత్తెనపల్లిలోని శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా, రెండున్నరేళ్ళు మంత్రి ఉన్న అంబటి రాంబాబు అక్రమంగా ధనార్జనకు పాల్పడటమే కాక నియోజకవర్గ పరిధిలో నామినేటెడ్ పదవులను అమ్ముకున్న తొలి ఎమ్మెల్యేగా నిలిచారని ఆరోపించారు. సత్తెనపల్లిలోని రూ.30 కోట్ల విలువ చేసే జెడ్పి స్థలాన్ని సైతం కాజేయడానికి జెడ్పి చైర్‌పర్సన్‌పై ఒత్తిడి చేసి బెదిరించారని అన్నారు. సంక్రాంతి సంబరాల పేరుతో లాటరీ టిక్కెట్లు విక్రయం ద్వారా, వెంచర్లు, నామినేటెడ్ పదవులు అమ్మకం ద్వారా ఇంకా అనేక విధాలుగా ఆయన సంపాదించిన అక్రమ సంపదను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

సమావేశం లో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ హెచ్చరించారు. సబ్ డిస్టిక్ లెవెల్ సలహా సంఘం సమావేశం సత్తెనపల్లిలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. గర్భాధారణ పూర్వ గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994 అమలుపై సమావేశంలో చర్చించారు. సత్తనపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి డాక్టర్ ధర్మ సింగ్ శాస్త్రి మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఉన్న అన్ని హాస్పిటల్లో పిసిపిఎన్డిటి చట్ట నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలోని పలు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీల్లో డాక్టర్ శాస్త్రి గమనించిన విషయాలను గురించి చర్చించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, పలువురు వైద్యులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా నిలబడేవారు, వాటిపై పోరాటం చేసేవారు, శాస్త్రీయ దృక్పథకం కలిగి ఉండి దాన్ని ప్రచారం చేసేవారు జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని సీనియర్ నాయకులు ఎవి శివయ్య కోరారు. ఈ మేరకు సభ్యత్వ నమోదు కరపత్రాలను స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పివి సుబ్బారావు, చుక్కా విన్సెంట్‌పాల్, పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు, డివిజన్ ఉపాధ్యక్షులు ఉన్నవ రాజేష్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి, అంజనేయరాజు పాల్గొన్నారు.

మాచర్లలో పరిస్థితులు నన్నే భయపెట్టాయి

ఇక రౌడీమూకలకు కాలం చెల్లినట్లే : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పెంచి పోషించడంతోపాటు ఇంతకాలం కాపాడింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం మారడంతోనే రాష్ట్రంలో రౌడీమూకలకు కాలం చెల్లిందని, రామకృష్ణారెడ్డి అరెస్టు అందుకు నిదర్శనమని చెప్పారు. ప్రజల్ని భయం గుప్పిట్లోకి నెట్టి, ఆ భయమే పెట్టుబడిగా రూ.వేలకోట్లను దోచుకున్నారని, ఎంతోమంది టిడిపి కార్యకర్తల రక్తం కళ్లజూసిన రాక్షసుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డని ధ్వజమెత్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడున్నర దశాబ్ధాలుగా రాజకీయాలు చూస్తున్న తనకే గత ఐదేళ్ళుగా మాచర్ల నియోజకవర్గంలో నెలకొన్న దారుణ పరిస్థితులు భీతి కలిగించాయని, ఇక స్థానిక ప్రజల పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. పరారీలో ఉన్న రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకటరామిరెడ్డి, అనుచరుడు తురకా కిషోర్, ఇతర ముఠానూ సాధ్యమైనంత త్వరలో పట్టుకోవాలని, పల్నాడులో పూర్తిస్థాయిలో ప్రశాంత పరిస్థితులు నెలకొల్పడంలో అది కీలకమని చెప్పారు. బీసీ నాయకుడు చంద్రయ్య హత్య రోజు నుంచే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాజకీయ పతనం ప్రారంభమైందని, ఇంత కాలం అతని దురాగతాలకు అండగా నిలిచిన పోలీసు సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

నీట్ ప్రశ్నాపత్రం లీక్ మీద మోడి మౌనంపై అనుమానాలు

టిడిపి, జనసేన, వైసిపిలు తమ వైఖరిని ప్రకటించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నీట్ ప్రశ్న పత్రాలు లీకేజీ విషయంలో బిజెపిలోని కీలక నాయకులకు, మంత్రులకు సంబంధం ఉన్నందువల్లే ప్రధానమంత్రి మౌనం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నా ఆయన ఖండించడం లేదని, దీనిపై అనేక అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ఈ అంశంపై టిడిపి, జనసేన, వైసిపిలు ఎందుకు మాట్లాడ్డం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆ పార్టీల వైఖరిని ప్రకటించాలన్నారు. గత పదేళ్లలో దేశంలో 70 సార్లకు పైగా ప్రధాన పరీక్షల పేపర్లు లీకయ్యాయని, ఈ విషయంలో బిజెపి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కిందని ఎద్దేవా చేశారు. ప్రశ్నాపత్రాలు లీకేజీ అంశానికి సంబంధించి బాధ్యత వహిస్తూ కేంద్రం మంత్రి రాజీనామా చేయాలని, పార్లమెంటరీ సంయుక్త కమిటీ వేసి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరారు.

వర్షాల దృష్ట్యా అతిసార ప్రబలే అవకాశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అతిసారపై మండల కేంద్రమైన రొంపిచర్లలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన నీరు తాగాలని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షాలకు అతిసార వ్యాధి ప్రబలే అవకాశముందని, పరిసరాల, వ్యక్తిగత శుభ్రత ద్వారా అతిసార వ్యాధి నివారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అతిసార బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో పిల్లలకు, తల్లులకు అతిసార వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. వచ్చే నెల 1 నుండి ఆగస్టు 31 వరకు ఐడిసిఎఫ్ కార్యక్రమం జరుగుతుందని, ఎవరికైనా అతిసార వ్యాధి లక్షణాలుంటే వెంటనే ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. అనంతరం ఐడిసిఎఫ్ కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపిడిఒ సిహెచ్. లక్ష్మీకుమారి, ఎంఇఒ బ్రహ్మేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామాంజనేయరెడ్డి, ఇఒపిఆర్డీ శివరామకృష్ణ, ఐసిడియస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి డయేరియా నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించాలన్నారు. తాగునీటి బావుల క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలన్నారు. పైప్ లైన్లను పరిశీలించాలని, సైడు కాల్వల్లో పూడికలు తీయించాలని చెప్పారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యం పట్ల పర్యవేక్షణ ఉండాలని, ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్లను పరిశుభ్రం చేసి స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించేలా చూడాలని ఎంఈఓ-2 రామతులసితో చెప్పారు. సచివాలయ సిబ్బంది వచ్చేనెల ఒకటిన ఉదయం 6 గంటల నుండి పింఛను పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో సిడిపిఒ బి.అరుణ, కొచ్చర్ల పిహెచ్‌సి వైద్యులు డి.నాగేంద్రబాబు, ముప్పాళ్ల పిహెచ్‌సి వైద్యులు షమిమా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆంధ్రా ప్యారిస్ రాజకీయం

- పార్టీ ఫిరాయింపులపై ఊహాగానాలు
- నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం
- కూటమి ప్రభుత్వ ఏర్పడిన తరువాత తొలి సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ
- ఎక్స్‌అఫీషియో సభ్యులుగా మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి

ఆంధ్రా ప్యారిస్‌లో రాజకీయం వేడెక్కుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలి సమావేశం కావటంతో అందరి దృష్టి కౌన్సిల్ సమావేశంపైనే ఉంది. దీనికి తోడు పురపాలక సంఘానికి సంబంధించి రూ.200 కోట్లు నిధులు వస్తే వాటిలో పెద్ద మొత్తంలో దుర్వినియోగమయ్యాయంటూ ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేయటం గమనించాల్సిన అంశం. అదే సమయంలో ప్రభుత్వం మారిన తరువాత మంత్రి నాదెండ్ల మనోహర్ పురపాలక సంఘం ఎక్స్ అఫీషియో సభ్యులయ్యారు. దీంతో సమావేశం ఎలా జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. దీనికి సంబందించిన వివరాలిలా ఉన్నాయి.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం 29న ఉదయం 11.30 గంటలకు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరుగనున్నట్లు ప్రకటించారు. కౌన్సిల్ సమావేశానికి 27 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు. దానిలో 9 పనులకు సంబందించి రాటిఫికేషన్ ప్రతిపాదన ఉంది. రాటిఫికేషన్‌కు ప్రతిపాదించిన మొత్తం పనుల విలువ దాదాపు రూ.47లక్షలుగా ఉంది. ఇదిలా ఉంటే కౌన్సిల్‌లో మొత్తం 40 మంది సభ్యులుండగా వారిలో 32 మంది వైసిపికి చెందిన వారే. 8 మంది టిడిపి సభ్యులున్నారు. అయితే ఎన్నికల సమయంలో వైసిపి నుంచి ఇరువురు కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించటంతో కూటమి బలం ఇప్పుడు 10కి చేరింది. పైగా ప్రభుత్వం మారిన వెంటనే ఎక్స్ అఫీషియో సభ్యులుగా మంత్రి నాదెండ్ల మనోహర్ ఉన్నారు. దీంతో కౌన్సిల్ సమావేశం ఎలా జరగుతుందోనన్న ఉత్కంఠత సభ్యుల్లో నెలకొంది.

తెనాలి పురపాలక సంఘు కార్యాలయం

రాటిఫికేషన్‌కు పెట్టిన అంశాలను పార్టీ బలంలో ఆమోదింపచేసుకునే యోచనలో చైర్‌పర్సన్, ఆ వర్గం సభ్యులు ఉన్నారు. ఈ ఎత్తుగడ సఫలమౌతుందా, దీనికి కూటమి సభ్యులు అడ్డుకుంటారా అనేది ప్రశ్న. మొత్తం మీద కౌన్సిల్ సమావేశం మాత్రం రసవత్తరంగా సాగుతుందనేది సర్వత్రా వినికిడి.

మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై..

పురపాకల సంఘానికి వచ్చిన రూ.200 కోట్లలో అధిక మొత్తం దుర్వినియోగమైందని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ఇటీవల ఓ సమావేశంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. సమాచార హక్కుచట్టం ప్రకారం పక్కా సమాచారంతోనే మాట్లాడినట్లు వారు వెల్లడిచారు. పైగా దుర్వినియోగమైన నిధులను రాబట్టాలని మంత్రి మనోహర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో దాదాపు రూ.47లక్షలు రాటిఫికేషన్‌కు ప్రతిపాదించటంపై ఏ విదంగా స్పందిస్తారోనన్నది సమావేశంలో తేలనుంది.

పార్టీ ఫిరాయింపులపై పుకార్లు

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా జత కట్టడంతో ఎన్నికలకు మందే 23వ వార్డు కౌన్సిలర్ తోక శిరీష, 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి కూటమిలో చేరారు. అదే దారిలో మరో 15 మంది సభ్యుల వరకూ ఉన్నట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపుకు ఇప్పటికే కొందరు సభ్యులు నిర్ధారణకు వచ్చినా, టిడిపిలో చేరాలా, జనసేనలో చేరాల అన్న మీమాంసలో ఉన్నట్లు తెలుస్తోంది. పైగా చైర్‌పర్సన్ స్థానం ఓసి మహిళకు రిజర్వుకాగా, తొలి రెడున్నరేళ్ళ ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన 21వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ ఖలేదా నశీంకు అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అవకాశం కల్పించారు. తదుపరి రెండున్నరేళ్ళ బిసి సామాజిక వర్గానికి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రాధికకు అవకాశం కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చైర్‌పర్సన్ విషయంలో టిడిపి పట్టుపడుతున్నట్లు సమాచారం. ఓసి మహిళకు కేటాయించిన స్థానంలో రిజర్వుడు కేటగిరికి చెందిన వారు కొనసాగటం సరికాదన్నది వారి భావన. దీనికి అనుగుణంగా కొందరు సభ్యులు చైర్‌పర్సన్ రేసులో ఉండి పార్టీ ఫిరాయింపులకు తెరలేపుతున్నట్లు కూడా సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులు, తదుపరి కార్యాచరణలో మనోహర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

బహిరంగ మద్యపానాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన ద్వారక తిరుమల రావును జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అభినందనలు తెలిపారు. తాడేపల్లిలోని డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, గాంధీజి చిత్రటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా బహిరంగ మద్యసేవనాన్ని అరికట్టడానికి కృషి చేయాలని డిజిపిని కోరారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, రాష్ట్రంలోని ప్రతి టోల్‌గేట్ వద్ద బ్రీత్ ఎనలైజర్లు వినియోగించి, ర్యాండంగా డ్రైవర్లను పరీక్షించాలన్నారు. అలాగే ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో వందలాది ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం చేయాలని కోరారు. చెక్‌పోస్టులు పెంచి, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పానీయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. అక్కడక్కడా నాటుసారా, కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు.

డిజిపిని అభినందిస్తున్న లక్ష్మణరెడ్డి

రేపు పాతబొమ్మువారిపాలెంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ముఖ్యఅతిథిగా పాల్గొననున్న భీమ్‌రావ్ యశ్వంత్‌రావ్ అంబేద్కర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేథావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభను జయప్రదం చేయాలని డాక్టర్ అంబేద్కరైట్ ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంద్రపాటి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. కొల్లిపర మండలం పాత బొమ్మువాని పాలెంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభ ఈనెల 30న సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుందని, ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆశోక్‌కుమార్ తెలిపారు. గ్రామగ్రామాన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలు జరుగుతున్నాయని, అది గ్రామాల్లో హక్కుల చైతన్య వేదికగా ప్రతిబింభిస్తుందన్నారు. విగ్రహావిష్కరణకు అంబేద్కర్ మనుమడు భీమ్‌రావ్ యశ్వంత్‌రావ్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. అలాగే సభలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, చరిత్రకారుడు బొనిగల రామారావు, హైకోర్టు న్యాయవాది చందోలు శోభారాణి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి వంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం మూడు గంటలకు దావులూరు అడ్డరోడ్డు నుంచి విగ్రహావిష్కరణ సభా ప్రాంగణం వరకూ భారీ ర్యాలీ ఉంటుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి మేథావులు, బుద్దిస్టులు, అంబేద్కర్ వాదులు పొల్గొంటున్న సభను జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు. నాగార్జున కాలేజి ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ కారుమంచి రవికుమార్ మాట్లాడుతూ భావితరాలకు అంబేద్కర్ ఆశయ స్ఫూర్తిని తెలియజేసేందుకు నిర్వహించే కార్యక్రమం విజయవంతం కావాలన్నారు. ఉపాధ్యాయులు కనపర్తి బెన్హర్, చుండూరు దళిత బాధితుల పోరాటి కమిటి జాలాది మోజస్ మాట్లాడారు. విగ్రహావిష్కరణ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు పిల్లి జయపాల్, తూమాటి అంబేద్కర్, దాసరి చినచంటిబాబు, పిల్లి నరశింహారావు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణలో అశోక్‌కుమార్, రవికుమార్, బెన్హర్ తదితరులు

యువకుడి ఆపరేషన్‌కు సాయం చేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి : యువకుడికీ ప్రాణ బిక్షపెట్టమని జనసేన రాష్ట్ర కార్యాలయానికి శుక్రవారం సత్తెనపల్లి వాసులు తరలి వచ్చారు. ఆపన్న హస్తం అందించాలని డిప్యూటి సియం పవన్ కళ్యాణ్ సాయం చేయాలని గ్రామ ప్రజలు, బాధితుడి కుటుంబ సభ్యులు ఫ్లెక్సీలతో పవన్ కళ్యాణ్‌ను వేడుకున్నారు. గ్రామస్థులు మాట్లాడుతు చల్లా సురేష్ (19)తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక వెంటనే తనూ చనువుచాలించాలని ఆత్మహత్యచేసుకున్నాడు. కుటంబ సభ్యులు వెంటనే గుంటూరు తులసి హాస్పటల్‌లో చేర్చినప్పటికి సేవించిన ర్యాట్ పాయిజన్ వలన లివర్ డామేజ్ అయినది. తప్పక లివర్ ట్రాన్స్ ప్లాంట్ చేయాల్సిన పరిస్థితి ఉందని వైద్యులు తెలిపారు. కడుపేదరికంతో ఉన్న సురేష్ కుటుంబ సభ్యులకు సుమారు నలభై లక్షలు రూపాయలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పటంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో డిప్యూటి సియం పవన్ కళ్యాణ్ స్పందించి తగు సహాయం అందించాలని కోరుతున్నారు.

జనసేన రాష్ట్ర కార్యాలయం ఎదుట ప్రాణ బిక్ష పెట్టమని వేడుకుంటున్న బాధితులు

ప్రజాదర్బార్‌లో లోకేష్‌కు పలువురు వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

కరెంటు బిల్లు అధికంగా వచ్చిందని వికలాంగ పింఛను తొలగించారని మంగళగిరి మండలం యర్రబాలెంకు చెందిన తాడిబోయిన రవీంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మేరకు శుక్రవారం నారా లోకేష్ ప్రజాదర్బార్ ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ షాక్‌లో రెండు చేతులు కోల్పోయిన తనకు వికలాంగ పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం తొలగించిన వితంతు పింఛనును పునరుద్ధరించాలని తాడేపల్లి పోలకంపాడుకు చెందిన హైమావతి కోరారు. ఎలాంటి ఆధారం లేని తమకు ఇల్లు కూడా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె వైద్యానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడి గ్రామానికి బిరుదు కమలాకరరావు కోరారు. పిజి చదివి రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన తనకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఎన్‌టిఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన షేక్ సల్మ విజ్ఞప్తి చేశారు.

మాజీ మంత్రి అమర్నాథ్ అండతో భూమి కబ్జా

విశాఖ జిల్లా గాజువాక మండలం దువ్వాడలో రూ.4 కోట్లు విలువైన తమ 84 సెంట్ల భూమిని వైసిపి ప్రభుత్వ అండతో దేవెళ్ల వెంకటరమణ, రావి సత్యనారాయణ కబ్జా చేశారని తమకు న్యాయం చేయాలని అదే ప్రాంతం డ్రైవర్ కాలనీకి చెందిన సిహెచ్.శ్రీనివాసరావు, జె.తాతారావు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి అమర్నాథ్, సిఐ బి.శ్రీనివాసరావు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి భూములు కబ్జా చేశారని వాపోయారు. దీనిపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు ఉండవల్లిలో సిఆర్‌డిఎ అధికారుల సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ ఎం.విశ్వేశ్వరనాయుడు శనివారం ఉదయం పది గంటలకు ఉండవల్లి సచివాలయం-2 వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీడ్ యాక్సిస్ రోడ్డుకు సంబంధించి భూములు గల రైతులందరూ ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంట వరకు ఉండవల్లి సెంటర్, జామాయిల్ తోట, రామకృష్ణ థియేటర్, సాయినగర్, బాపనయ్య నగర్, గెస్ట్‌హౌస్ రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ అక్కత సత్యనారాయణ, ఎఇ షణ్ముకరావు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో బైపాస్‌రోడ్డు అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్ మొదటి అంతస్తులో గ్రంథాలయం ప్రారంభిస్తున్నట్లు ఎంటిఎంసి కోశాధికారి గాదె సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ సి.నీలిమ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పుస్తక అభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అధ్యయనం సామాన్యులను కూడా మేథావులను చేస్తుందని, పిల్లలు, పెద్దలు ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని అన్నారు. పుస్తక పఠనం అలవాటు పడిన వారు శాస్త్రవేత్తలు, కలెక్టర్లు, ఇంజనీర్లు, సంఘ సంస్కర్తలు, నాయకులు, కవులు, విద్యావేత్తలు, మేథావులుగా తయారైన వారు ఉన్నారని తెలిపారు. చదవడం వల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనాశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అపార్టుమెంట్‌లో నివశించే పుస్తక ప్రియులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

బడి ఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేరుదాం

ప్రజాశక్తి-ఈపూరు

బడి ఈడు పిల్లలను పాఠశాలలలో చేర్చాలని ఈపూరు జెడ్పి పాఠశాల హెచ్ఎం ఎం.రామకృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు మండల కేంద్రమైన ఈపూరులో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. 5-16 ఏళ్లలోపు పిల్లలను చదువుకునేందుకు పాఠశాలలకు పంపించాలన్నారు. విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, జాన్‌మోసెస్, వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, రాణి, హనుమాయమ్మ, అరుణకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 74మంది హాజరు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రామకృష్ణాపురం బాలురు గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రవేశ పరీక్షకు 74 మంది హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలురు గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుండి 9 తరగతి వరకు ఖాళీగా సీట్లు భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించగా ప్రిన్సిపాల్ ఓ.జాన్సన్ పర్యవేక్షించారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుణ్ణి కలిసిన పల్నాడు నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి నాయకులు గురువారం పాల్గొన్నారు. సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు, రాష్ట్ర రైతు కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, టిడిపి నాయకులు నిమ్మగడ్డ నాగశ్రీనివాస్, అలపర్తి గోపాలరావు శొంఠినేని మార్కండేయులు తదితరులు పాల్గొన్ని రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును సత్కరించారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ చిరుమామిళ్ల మధుబాబు సత్కరించారు.

7న అన్ని గ్రామాల్లోనూ ఎంఆర్‌పిఎస్ జెండావిష్కరణలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వచ్చేనెల 7వ తేదీన ప్రతి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ జెండాను ఆవిష్కరించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు మాదిగ విజ్ఞప్తి చేశారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య పల్నాడు జిల్లా సమావేశం సత్తెనపల్లి బాప్టిస్ట్ చర్చ్ ఆవరణలో శుక్రవారం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షులు వంగూరి అశోక్ కుమార్ మాదిగ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ 30వ వార్షికోత్సవాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. నాయకులు సిహెచ్.ఆగస్టస్ మాదిగ, జి.హిట్లర్ మాదిగ, పి.శివమాదిగ, జి.సాల్మన్ రాజు మాదిగ, వి.విజయవర్ధన్ మాదిగ పాల్గొన్నారు.

రేయిబవళ్లు పని చేసినా అలవెన్స్ ఇవ్వలేదు

ఎన్నికల విధుల అలవెన్స్ కోసం జెసికి విఆర్‌ఎల సంఘం వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించిన గ్రామ రెవెన్యూ సహాయకు(విఆర్‌ఎ)లకు ఎన్నికలకు సంబంధించి అలవెన్సును ఇంతవరకు మంజూరు చేయలేదని, గౌరవ వేతనంతో పని చేసే విఆర్‌ఎలకు అలవెన్స్ తక్షణమే మంజూరు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బందగీ సాహెబ్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి పనులతో పాటు ఆయా విధులకు హాజరయ్యేందుకు వచ్చిన పోలింగ్ సిబ్బందికి గ్రామ రెవెన్యూ సహాయకులు పగలనక, రాత్రనక సమయపాలన లేకుండా ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. అటువంటి విఆర్‌ఎలకు కొన్ని మండలాల్లో రూ.200-300 మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన దగ్గర నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల విధులకు సంబంధించి గ్రామ రెవెన్యూ సహాయకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అయినా అలవెన్స్ ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ తహశీల్దార్లతో సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన అలవెన్స్ అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, సుబ్బారావు, కాసులు, వెంకట్రావు, దినేష్, బుడే, నాగేశ్వరరావు, శివ, రోశయ్య, కోటయ్య, బాష, సిలార్, మీరా, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కుక్కల బెడదను నివారించాలని ఐద్వా వినతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో కుక్కల బెడదను నివారించాలని ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేద్కర్ నగర్ మహిళలు ఐద్వా ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉమశ్రీ మాట్లాడుతూ 31వ వార్డులో అంబేద్కర్ నగర్లో చిన్న పిల్లలు స్కూలుకు వెళుతున్న సందర్భంలో, మహిళలు పనులకు వెళ్లేందుకు వివిధ రకాల వివిధ పనుల నిమిత్తం బయటకు వెళుతున్న సందర్భంలో కుక్కలు గుంపులు గుంపులుగా వెంటపడుతున్నాయని చెప్పారు. కమిషనర్ స్పందిస్తూ కుక్కల నివారణ చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజని, స్థానిక మహిళలు మరియమ్మ, సావిత్రి, సుజాత, వీరమ్మ, వెంకట నరసమ్మ, కృష్ణవేణి, శాంతకుమారి, స్పందన, డివైఎఫ్ఐ నాయకులు రాజకుమార్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు, మహిళలు

న్యాయవాది పురేటి శ్రీనివాసరావుకు నివాళులు

ప్రజాశక్తి - వినుకొండ : సీనియర్ న్యాయవాది పురేటి శ్రీనివాసరావు సంస్మరణ సభ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సభకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎస్ఎం.వి నాయుడు అధ్యక్షత వహించారు. సీనియర్ న్యాయవాది నల్లమోతు రామకోటేశ్వరరావు, పిజె లూకా, ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ అందర్నీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ పురేటి శ్రీనివాసరావు కక్షిదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి బాధలు తెలుసుకుంటూ వాళ్లకి న్యాయం జరిగేటట్లు చూసేవారని చెప్పారు. వారి కుటుంబానికి బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దిన్ ఖాన్, ట్రెజరర్ చీమకుర్తి బ్రహ్మం, పొట్లూరి సైదారావు, తెలగంశెట్టి హనుమంతరావు, ఎలవర్తి శ్రీనివాసరావు, ముట్లూరు ఎలిషా బాబు, ఎస్కె సిద్దయ్య, భీమవరపు శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, మారెళ్ళ సీతారామాంజనేయులు, వడ్లమాని అమర్ బాబు, కాళంగి చెన్నయ్య, నక్క రమణ రావు, కాకాని నాగేశ్వరావు, ఆళ్ల మహేశ్వర్ రెడ్డి, వరగాని శివశంకర్‌బాబు, అస్మతుల్లా ఖాన్, నాగరాజు పాల్గొన్నారు.

మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగేశ్వరరావు, నరసింహారావు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశంలో కూడా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.నాగవర్ధన్ అన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్వహించాలన్నారు. పట్టణంలోని మలేరియా కార్యాలయంలో శుక్రవారం హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ మాచర్ల తాలుకా నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కవిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, పిబివిఎల్ నరసింహారావు, కోశాధికారిగా ఆర్.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా ఎ బాలయ్య, ఉపాధ్యక్షులుగా బి.సద్గుర్‌బాబు, వి.విజయకుమారి, డి.లక్ష్మయ్య, డి.మురళిధర్, కరిమున్నాసా, సహయ కార్యదర్శులుగా ఎం.శ్రీనివాసరావు, ఆర్.రాజేశ్వరి, టి.విమల, బివి సుబ్బాచారి, ఎస్.నూరుబాషా, వి.వేదమణి, డి.కొండలు, డి.నాగమణి, డి.విజయలక్ష్మి, ఎస్.రాణి, డి.కుమారి, డి.కుమారిభాయ్, షేక్ టి.బేగం ఎన్నికయ్యారు.

ఫోన్‌లో కాదు.. గ్రౌండ్‌లో ఆడండి..

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి - అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల

సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ క్రీడల పట్ల అసక్తిని చూపాలని యువతకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలోని క్రీడా మైదానంలో టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఆన్వర్‌బాషా ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత సెల్‌ఫోన్‌లలో వీడియో గేమ్‌లు, పబ్జి గేమ్స్ ఆడేందుకు అలవాటు పడుతున్నారని, ఇది మంచి పరిణామం కాదని అన్నారు. శరీరానికి ఫిజికల్ ఎక్సైర్‌సైజ్ ఎంతో అవసరమని, ఫోన్‌లో కాకుండా గ్రౌండ్‌లో ఆడాలని చెప్పారు. అసక్తి ఉన్న ఏదో ఒక ఆటను ఎంపిక చేసుకుని అందులో రాణించాలని సూచించారు. ఆటల నుండి టీమ్ స్పిరిట్ కూడ వస్తుందన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకోని బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆన్వర్‌బాషా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.1,33,318, రెండోవ బహుమతిగా రూ.93,318, మూడవ బహుమతిగా రూ.63,318, 4వ బహుమతిగా రూ.33,318, ఇతర బహుమతులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి స్పాన్సర్ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో జూలకంటి అక్కిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.దుర్గారావు, బి.శ్రీనివాసరావు, కె.అనిల్‌కుమార్, జి.శేషు, సిహెచ్.ఆంజనేయులు, నాగూర్ బాషా, ఒ.క్రాంతికుమార్, రామాటాకీస్ జాని, ఖాజా, కుమార్, మదీన్, లాలా, వినోద, శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ నిర్వహణ అభినందనీయం

రాష్ట్ర ప్రభుత్వం నడిపే వరకు అన్నా క్యాంటీన్లలను ఆర్యవైశ్యులు కొనసాగించడం ఎంతో హర్షణీయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో భోజన పంపిణీని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం మూసేయించిందని, వాటిని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. మాచర్ల పట్టణంలోని అన్నా క్యాంటీన్ ద్వారా ఉచితంగా అన్నదానం చేసేందుకు పట్టణ ఆర్యవైశ్య సంఘం పెద్దలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్లు నడిచే వరకు ఆర్యవైశ్య సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలిరోజు అన్నదాత మారం ప్రసాదరావు అని చెప్పారు. పెళ్లి రోజులు గాని, పుట్టిన రోజు గాని తమ ఇంట్లో జరుపుకునే వేడుకల సందర్భంగా పది మందికి అన్నం పెట్టాలని ఆలోచన ఉంటే అన్నా క్యాంటీన్లలకు సహకారం అందించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘ పెద్దలు మారం ప్రసాదరావు, సూరే యల్లమంద, కంభంపాటి అనిల్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేసే అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించే వరకు తాము కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు, ఎఇ ఆదిత్య, సచివాలయ ఆడ్మిన్ శ్రీలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.దుర్గారావు, బి.శ్రీనివాసరావు, ఎస్.వేణు, ఆర్యవైశ్య సంఘ పెద్దలు కె.వెంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, కె.చంటి, వి.గోపాలక్రిష్ణమూర్తి, జి.శేషు, ఎం.చినవెంకటేశ్వర్లు, డి.వెంకటశేషు, ఎం.రాముడు, బి.లక్ష్మీచెన్నకేశవరావు, కె.సైదయ్య, ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

వరి విత్తనాల బ్యాగులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

48 మంది రైతులకు వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలోనీ అన్నదాత సుఖీభవ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 48 మంది చిర్రావూరు, గుండి మెడ, రామ చంద్రాపురం గ్రామాల రైతులకు 170 బిపిటి ,5204 వరి విత్తనాలు 25 కేజీల బ్యాగు లను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, జనసేన గ్రామ అధ్యక్షులు అంకం కాళీ కృష్ణ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

టిడిపి మండల అధ్యక్షులు బండ్లమూడి బాబురావు

ప్రజాశక్తి - పొన్నూరు

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పొన్నూరు మండల టిడిపి అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు అన్నారు. శుక్రవారం పొన్నూరు మండలంలోని మన్నవ, ఆరెమండ గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రలో రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రైతుల హితమే పరమావధిక సేవలు అందించడం జరుగుతుందన్నారు. దేశానికి వెన్నెము కగా ఉన్న రైతులను ఆదుకోవాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రైతులకు ప్రభుత్వం అందజేసిన వరి వంగడాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీన ఇంటి వద్దే పెన్షన్ల పంపిణీ

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 59,403 మంది పెన్షనర్లకు జూలై 1న ఉదయం 6 గంటల నుండి వారి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని సచివాలయ కార్యదర్శుల ద్వారా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో జూలై 1 వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని వార్డ్ సచివాలయ కార్యదర్శుల ద్వారా పెన్షనర్ల ఇంటి వద్దనే అందించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. నగరంలోని 206 వార్డు సచివాలయాల పరిధిలో 59,403 మంది పెన్షనర్లకు రూ.40,87,60,000లను వారి ఇంటి వద్దనే 1632 మంది వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. పెన్షన్‌ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణకు 42 మంది నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. పెన్షన్ల పంపిణీ విధులు కేటాయించబడిన కార్యదర్శులు 1వ తేదీకి ముందే తమకు కేటాయించిన ప్రాంతం, పెన్షనర్ల సంఖ్య (కేటగిరి వారిగా), పంపిణీ చేయాల్సిన నగదు తదితర అంశాలను నోడల్ అధికారి ద్వారా తెలుసుకోవాలని ఆదేశించామన్నారు. పెన్షన్ పంపిణీ ఉదయం 6 గంటల నుండే ప్రారంభించాలని, ప్రతి గంటకు పంపిణీ శాతం జిఎంసికి తెలియచేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శుల పై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన కీలకం

ప్రజాశక్తి-గుంటూరు

న్యాయవాదిగా రాణించాలంటే భారత రాజ్యాంగంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గుంటూరులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయకళాశాల స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల పాలకమండలి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి వేమన కుప్పుస్వామి, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, సభ్యులు కొర్రపాటి రామారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధృవపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు తదితరులు

యువ డిఫెన్స్ అకాడమిలో 'సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్'

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచార వారోత్సవాలలో భాగంగా ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండ యువ డిఫెన్స్ అకాడమీ లో అకాడమీ విద్యార్థులతో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో కాంటెస్ట్ కార్యక్రమం శుక్రవారం ఉదయం వినూత్నంగా జరిగింది. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్ మాట్లాడుతూ యువత దేశానికి ఆదర్శం కావాలన్నారు. అందమైన జీవితాన్ని మత్తు పదార్థాలు తీసుకొని దుర్భర జీవితం అనుభవించవద్దని ఆయన సూచించారు. విద్యార్థిని విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు అనేది జీవిత పతనానికి ఎటువంటి చేరుస్తాయో ముందుగా తెలుసుకోవాలన్నారు. మంచి అవగాహనతో విషయాలను తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలన్నారు. తాము చదువుకోవడంతోపాటు తమ తమ కుటుంబాలకు, సమాజానికి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. యువర్ డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ జి అర్చన మాట్లాడుతూ మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించే విద్యార్థులు బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆమె సూచించారు. డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమని ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ డిఫెన్స్ అకాడమీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శంకర్ బాబు, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి విజయ రాణి, యువ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ విజయ రత్న కుమాం ను సత్కరిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి

డాక్టర్ విజయ రత్నకుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

వైద్యవృత్తి పట్ల గౌరవం సమయపాలన క్రమశిక్షణ పాటించే అధికారులను సిబ్బంది ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కె విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పెదనందిపాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి విజయ రత్నకుమార్ శనివారం ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా సహ ఉద్యోగులు ఏర్పాటు చేసిన అభినందన సభకు డాక్టర్ లావణ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ప్రజలకు ఉత్తమైన సేవలు అందించి వైద్య ఆరోగ్య శాఖకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ విజయ రత్నకుమార్‌ను పట్టు శాలవతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ సుబ్బరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్ బాబు, సిహెచ్ఓ ప్రసాద్ స్వామి, హెల్త్ సూపర్వైజర్ చెన్నయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగులపాడు పాఠశాలలో విద్యార్థులు ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్ సాంబశివరావు

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

నాగులపాడులో స్వయంభూగా వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి వారు సువర్ణ భారతీ మహోత్స వాల సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపీపీ స్కూల్ లో ఉన్న పేద విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిల్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ చైర్మన్ గొల్లపూడి సాంబశివరావు ఉపాధ్యక్షులు పాటిబండ్ల సుబ్బారావు. విజయ్ కుమార్ కామేశ్వరరావు కాపు సుబ్బారావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన భూములకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థాన భూములకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం దేవస్థానం పరిధిలో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలము వీరనాయకునిపాలెం గ్రామ శివారు సర్వే.నెం.561, 566/1ఎ, 566/3బి లోని య.1-70, య.4-00, య.2-70, య.5-00, య.2-58, య.2-00, సెంట్లకు మాగాణి భూమికి, దేవరాయబొట్లవారిపాలెం గ్రామ సర్వే నెం.23ఇ య.0.50 సెంట్ల మాగాణి భూమికి 2వ పర్యాయము ఈ నెల 29న ఉదయం 11గంటలకు వేలం జరుగుతుందన్నారు. వేలం ప్రక్రియ గుంటూరు దేవాదాయ ధర్మాదాయశాఖ ఉప కమీషనరు, సంబంధిత అధికారుల సమక్షంలో దేవాలయ కళ్యాణమండపంలో మూడు సంవత్సరముల కాలపరిమితికి ముందస్తు కౌలు చెల్లించేవిదంగా బహిరంగ వేలము జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనాలని వివరాలకు తమను సంప్రదించాల్సిందిగా కోరారు.

సిఐ వినోద్ కుమార్‌ను అభినందించిన కాపు బలిజ సంక్షేమ సేన నాయకులు

సిఐ వినోద్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అర్బన్ సీఐగా వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. ఈ నేపధ్యంలో ఆయనను శుక్రవారం కాపుబలిజ సంక్షేమ సేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు తిరుమల శెట్టి కొండలరావు ఆధ్వర్యంలో నాయకులు కలిసి పూల మొక్క అందజేసి దశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, గతంలో వినోద్ కుమార్ ఎస్సైగా మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. మంగళగిరి సీఐ గానూ శాంతిభద్రతల పరిరక్షణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని, ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు బలిజ సంక్షేమ సేన నాయకులు కే సుందరయ్య, బాణాల నాగేశ్వరరావు,లింజినేని శ్రీనివాసరావు,దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పి స్తున్న నాయకులు

ఘనంగా గోవాడ హనుమంతరావు వర్ధంతి

ప్రజాశక్తి - మంగళగిరి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శివాలయం మాజీ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ గోవాడ గోవాడ హనుమంతరావు 13వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నాడు మంగళగిరి టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస రావు మాట్లాడుతూ టిడిపిలో గోవాడ హనుమంతరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తోట పార్థసారథి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, బీసీ సెల్ అధ్యక్షుడు వాక మాధవరావు గౌడ్, రాష్ట్ర సాధి కార సమితి సభ్యులు అన్నం నాగబాబు, రాష్ట్ర నాయకులు గాదే పిచ్చిరెడ్డి, వెలగపాటి విలియం, గోవాడ రవి, కోసూరి రాజశేఖర్, అబ్దుల్ మజీద్, తిరువీధుల బాపనయ్య, రేఖా సుధాకర్ గౌడ్, మహమ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోకి ఆరుగురు బడి బయట పిల్లలు

ప్రజాశక్తి - చేబ్రోలు : ఆరుగురు బడి బయట పిల్లలను శుక్రవారం పాఠశాలలో చేర్చటం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు ఏ బి హెచ్ ప్రసాద్, ఆర్ సుబ్బారావు తెలిపారు. నూరు శాతం బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చేందుకు నేను బడికి పోతా ర్యాలీలో విద్యార్థులను గుర్తించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు, ఏ వి హెచ్ ప్రసాద్ , ఈఓపిఆర్ ఆర్ డి జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతులు వున్నాయని అన్నారు. విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, నోట్స్ బుక్కులు,స్కూల్ బ్యాగులు, షఉ, ఒక జత యూనిఫామ్ తో పాటుగా, సంపూర్ణమైన బలవర్ధకమైన మధ్యాహ్న భోజనం అందించటం తో పాటు పేద విద్యార్థుల కుటుంబాలకు సంక్షేమాన్ని అందిస్తుందనిఅన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి మహేష్ కుమార్, చలపతిరావుతదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కొమ్మాలపాటి

ప్రజాశక్తి- పల్నాడుజిల్లా

వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లాలో పరిస్థితులపై ఆయన చంద్రబాబుతో చర్చించారు. పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధికై చేపట్టాల్సిన చర్యలు జిల్లాకు సంబంధించి పలు అంశాలపై ముఖ్యమంత్రితో కొమ్మాలపాటి శ్రీధర్ చర్చించారని కొమ్మలపాటి శ్రీధర్ ప్రతిపాదించిన అంశాల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని టిడిపి జిల్లా కార్యాలయం నుండి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని సత్కరిస్తున్న కొమ్మాలపాటి

మున్సిపల్ వర్కర్ల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన మొహమ్మద్ నసీర్ అహ్మద్‌ను ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు శుక్రవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు ఏపార్టీ అధికారంలో ఉన్నా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల పెంపుదలకు సంబంధించి తొమ్మిది మంది అధికారుల కమిటీ ఇచ్చిన రిపోర్టు ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో పెండింగ్ ఉందని, దానిని త్వరగా ఆమోదించే విధంగా కృషి చేయాల కోరారు. అలాగే గుంటూరు నగరంలో బదిలీ పారిశుధ్య కార్మికులను రోజువారీ మస్టర్ కార్మికులుగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కుంభా శివయ్య, కాలంగి భాగ్యరాజు, కె.మరియదాసు, జి.శ్రీనివాసరావు, శ్రీ బాల ప్రసాదరావు, రెహమాన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నసీర్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ఆలయాన్ని సందర్శించిన తమిళనాడు గవర్నర్

స్వాగతం పలికిన జిల్లా అధికారులు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలంగాణ, పుదుచ్చేరి గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ శుక్రవారం గుంటూరు విచ్చేశారు. స్థానిక కృష్ణనగర్‌లోవున్న శ్రీ లక్ష్మీ నారాయణ దేవస్థానాన్ని సందర్శించారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అంతకు ముందు గుంటూరు వచ్చిన గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , జిల్లా ఎస్పి తుషార్ దూడి , సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి , గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళ మాధవి లు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనుల వేగంగా జరుగుతున్నాయన్నారు. సిఎం చంద్రబాబు నాయుడ్ని కలిశానని దక్షిణ భారతంలో వున్న నదుల అనుసంధానం వల్ల వర్షపు జలాలు నిరుపయోగంగా సముద్రంలో కలవకుండా వుంటుందని , అందువల్ల నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నానన్నారు. ఆర్డిఓ పి.శ్రీఖర్ , గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే గల్లా మాధవి

హోం మంత్రికి మట్టుపల్లి మోహన్ అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రిగా నియమితులైన వంగలపూడి అనితను శుక్రవారం మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాశాలలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని హోం మంత్రిని కోరగా వారు అంగీకారం తెలిపారన్నారు.

నక్కా ఆనందబాబుకు గ్రంథాలయాధికారి అభినందనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

మాజీమంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును తుళ్లూరు శాఖా గ్రంధాలయాధికారి టి గిరిధర్ కుమార్ శుక్రవారం కలిసి అభినందించారు. ఆత్మీయులు, తన చిన్న నాటి స్నేహితుడు ఆనందబాబు ప్రజా ప్రతినిధిగా ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ ఉన్నత పదవులు అధిష్టించాలని కోరుకుంటున్నానని గిరిధర్ కుమార్ తెలిపారు.

పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు నసీర్ అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు

టిడిపి రాష్ట్ర అధ్యక్షు లుగా ప్రమాణ స్వీకారం చేసిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ శుక్రవారం మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో కలిసి అభినంద నలు తెలిపారు. టిడిపిలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకి తోడుగా ఉండి న్యాయం చేయాలని శ్రీనివాస్‌ను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాగర్లమూడి శ్రీనివాస్, గోళ్ల ప్రభాకర్, వేల్చూరు కిరణ్, ఏడుకొండలు, మైనార్టీ నాయకులు కరిముల్లా, చిన్న, బుజ్జి పాల్గొన్నారు.

విజ్ఞాన్ వీసీకి ఎన్‌సీసీ గౌరవ కల్నల్ ర్యాంక్

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్‌కు ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందిస్తున్నట్లు న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ శుక్రవారం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఆయనకు అందజేస్తామని వెల్లడించింది. విజ్ఞాన్స్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీను ఏకీకతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థుల్లో క్రమశిక్షణ, స్నేహభావం, నిబద్ధత, సమగ్ర అభివద్ధికి చేస్తున్నటువంటి కషికిగాను ఈ అందిస్తున్నామని పేర్కొంది. యూనివర్శిటీలో ఎన్‌సీసీ కార్యకలాపాలను ఎక్కువగా నిర్వహించటంలో ఆయన విశేషమైన నిబద్ధతను ప్రదర్శించారని తెలియజేసింది. ఎన్‌సీసీ, ఎన్‌సీసీయేతర క్యాడెట్‌లకు 20 క్రెడిట్‌లను అందించే ఎన్‌సీసీ మైనర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడం ఆయన సాధించిన విజయాలలో అతి ముఖ్యమైనదని, ఎన్‌సీసీ ట్రైనింగ్ ప్రాముఖ్యతను గుర్తిస్తూ అకడమిక్ కరిక్యులమ్‌లో ఇంటిగ్రేటెడ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఎస్ఎస్‌బీ ట్రైనింగ్‌ను ఎన్‌సీసీ మైనర్ కోర్సులో విలీనం చేశారని తెలిపారు. ఈయన నాయకత్వంలో కఠినమైన శిక్షణ, క్యాడెట్‌లలో క్రమశిక్షణ, స్నేహ భావాన్ని పెంపొందించడం కోసం విశ్వవిద్యాలయంలో క్యాంపుల నిర్వహణకు అనువైన వాతావరణం ఏర్పాటుకు కషి చేశారని వెల్లడించింది. ఎన్‌సీసీ కోర్సును యాడ్ ఆన్ డిప్లొమాగా ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంగా గౌరవ కల్నల్ ర్యాంక్ లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గౌరవ కల్నల్ ర్యాంక్ సాధించిన వీసీని విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

డైరెక్టర్ ఆఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జె.సి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ అఫ్ ఎలక్ట్రికల్ సేఫ్టీ, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ జీ. విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ పూర్తి స్థాయి విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాష్ట్రంలో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలను విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వివిధ సందర్భాల్లో సంభవించే పలు రకాల విద్యుత్ ప్రమాదాలను గురించి ఆమె వివరిస్తూ, వాటి నుండి కాపాడుకొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు అధ్యాపకబందానికి తెలియజేశారు. 1991-2015 మధ్య కాలంలో యునైటెడ్ అఫ్ స్టేట్స్‌లోని వివిధ దేశాలలో విద్యుత్ ప్రమాదాల శాతం తగ్గుతూ ఉంటే మన దేశంలో విద్యుత్ ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటం బాధాకరమని, అవగాహనా లోపమే ఇందుకు ముఖ్య కారణమని, అందుకోసం వాటిని నివారించేందుకు విద్యుత్ భద్రతా అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపడం జరుగుతుందని తెలిపారు. ఇందులో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఏ ఐ) సాంకేతికతను ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లకు అనుసంధానంతో పలు దశల్లో జరిగే విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రక్రియ విధానం రూపొందించబోతున్నట్లు ఈ సందర్భంగా ఆమె వివరించారు. విద్యుత్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా విద్యుత్ ప్రమాదాల నుండి రక్షించుకోవచ్చని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నియంత్రణ దిశగా విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అడ్వాన్స్డ్ సేఫ్టీ ప్రొటెక్టర్ డివైజ్‌లను ఆవిష్కరించాలని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాస రావు, గుంటూరు ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ వై.ప్రసాద్, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టెక్నికల్ వి.జయబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ